క్లుప్తంగా

చిన్నారి మేధావికి అంబేడ్కర్ స్మారక అవార్డు



తెనాలి: రూరల్ మండలం గుడివాడకు చెందిన చిన్నారి మేధావి బండికళ్ల ప్రదీప్‌నారాయణకు మరో గౌరవం దక్కింది. ఇండియన్ న్యూస్ మీడియా కౌన్సిల్ 2025 సంవత్సరానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ అవార్డును ప్రకటించింది. మూడేళ్ల వయసు కలిగిన బాలుడు ప్రదీప్‌నారాయణ తన అద్భుత మేధస్సుతో దేశవ్యాప్తంగా గుర్తింపును పొందాడు. వివిధ రకాల వస్తువులను 500 వరకు 15 నిమిషాల వ్యవధిలో గుర్తిస్తున్నారు. తన అసాధారణ జ్ఞాపకశక్తిని, గమనికా సామర్థ్యం, నేర్చుకునే ప్రతిభకు గుర్తింపుగా పలు అవార్డులను స్వీకరించాడు. ఈ క్రమంలో తాజాగా ఇండియన్ న్యూస్ మీడియా కౌన్సిల్ ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ అవార్డు-2025ను ప్రకటించింది.

విద్యార్థి రాహుల్ ఏడుకొండలుకు సన్మానం

కొల్లిపర: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన చింతల రాహుల్ ఏడుకొండలును గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. దావులూరు గ్రామానికి చెందిన తాపీమేస్త్రి చింతల నాంచారయ్య కుమారుడు రాహుల్ ఏడుకొండలు తెనాలి ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ పబ్లిక్ పరీక్షల్లో 1000 మార్కులకుగాను 974 మార్కులు సాధించాడు. రాహుల్ ఉన్నత చదువులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని గ్రామస్తులు హామీ ఇచ్చారు. విద్యార్థి రాహుల్ ఏడుకొండలు మాట్లాడుతూ తన తండ్రి తాపీ మేస్త్రిగా పనిచేస్తూ తనను చదివిస్తున్నారని, ఆయన కష్టం విలువ ఎప్పటికీ వృథా కాకుండా ఉన్నత చదువులు చదివి తండ్రికి మంచి పేరు తీసుకొస్తానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంచి సందేశాలతో రెండు నాటికల ప్రదర్శన



తెనాలి: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారక నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో ఇక్కడి ఓపెన్ ఆడిటోరియంలో జరుగుతున్న జాతీయ స్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి రెండు నాటికలను ప్రదర్శించారు. తొలుత శ్రీకరణం సురేష్ మెమోరియల్, గుంటూరు వారి 'తరమెల్లి పోతున్నదో' నాటికను ప్రదర్శించారు. కుటుంబ సంబంధాల్లో వచ్చిన మార్పులను ఎత్తిచూపిందీ నాటిక. ఈ తరం ఇలాగే వెళ్లిపోతే రానున్న తరాల సంగతేంటనే ఆలోచనను రేకెత్తించేలా నాటికను ప్రదర్శించారు. రక్తసంబంధాలకు విలువలు లేని స్వార్థపూరిత సమాజంలో బతుకుతున్నా, మరణించినప్పటికీ బతికిన మనిషి జన్మ గొప్పది అన్న సందేశాన్ని ఈ నాటిక ఇచ్చింది. బొమ్మిడి రామకృష్ణ రచించి, దర్శకత్వం వహించిన ఈ నాటికలో ప్రధానమైన రాఘవరావు పాత్రలోనూ ఆయనే నటించారు. ఇతర పాత్రల్లో డాక్టర్ శ్రీజ సాదినేని, కరణం సరిత, అంద్రాజు జనార్ధనవర్మ, బీవీబీ రాయుడు నటించారు. సంగీతం వెంకటరమణ.

రెండో నాటిక..

తదుపరి అభ్యుదయ ఆర్ట్స్, విజయవాడ వారి 'ఆంగికం భువనం యస్య' అనే నాటికను ప్రదర్శించారు. అనంత హృదయారజ్ రచించిన నాటికను వేంపాటి రమేష్ దర్శకత్వంలో ప్రదర్శించారు. వేంపాటి రమేష్‌తో పాటు పొగర్తి నాగేశ్వరరావు, కరణం సరిత, రాజేశ్వరి, నల్లక శ్రీధర్‌బాబు, చింత దూండికృష్ణ నటించారు. సంగీతం కేవీ రమణ. ప్రదర్శనలకు ముందుగా నృత్యగురువు చల్లా యామిని శిష్య బృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. తెనాలి కళాకారుల సంఘం నిర్వహణలో ఆరంభమైన ఈ నాటికల పోటీలను గౌరవాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కార్యదర్శి పిట్టు వెంకట కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

19న వాక్ ఫర్ జీసెస్



మంగళగిరి టౌన్: క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన వాక్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ కోఆర్డినేటర్ కె. రవిప్రకాష్ తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని టౌన్ లూథరన్ చర్చిలో ఆదివారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ 19వ తేదీ ఉదయం ఆరు గంటలకు మంగళగిరి బస్టాండ్ దగ్గరున్న అంబేద్కర్ విగ్రహం నుంచి వాక్ ఫర్ జీసెస్ ప్రేయర్ ర్యాలీ ప్రారంభమౌతుందని తెలిపారు. గౌతమ బుద్ధ రోడ్, మిద్దె సెంటర్, పాత మార్కెట్ సెంటర్, హుస్సేన్ కట్ట మీదుగా తిరిగి గౌతమ బుద్ధ రోడ్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుంటుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో కమిటీ కోఆర్డినేటర్లు పాస్టర్లు కె. రవికుమార్, తిమోతి, వరప్రసాద్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీవాసవీ ఆలయ పాలకవర్గం హస్తగతానికి టీడీపీ హల్‌చల్

- సర్వసభ్య సమావేశంలోనే ఎన్నిక నిర్వహణకు డిమాండ్
- టీడీపీ కౌన్సిలరు అనుచరులతో సహా వచ్చి వీరంగం
- ఆలయ ప్రాంగణంలో ఉద్రిక్తత
- పోలీసుల అప్రమత్తతతో ఘర్షణ నివారణ, సమావేశం వాయిదా



ఆర్యవైశ్యుల వాగ్వాదం

తెనాలి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీని హస్తగతం చేసుకునేందుకు టీడీపీ చేసిన ప్రయత్నం విఫలమైంది. సర్వసభ్య సమావేశంలోనే ఎన్నిక నిర్వహించాలని టీడీపీకి చెందిన ఆర్యవైశ్య నాయకులు డిమాండ్ చేశారు. తన అనుచరులతో సహా వచ్చిన ఆ పార్టీ కౌన్సిలరు ఒకరు వీరికి మద్దతుగా చెలరేగిపోయారు. ఎన్నికలు జరపాలంటూ రుబాబు చేశారు. దీంతో పవిత్రమైన అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో ఇరువర్గాల వాగ్వాదం, తోపులాట, అసభ్య పదాలు, ఉద్రిక్తతతో హోరెత్తిపోయింది. పోలీసులు అతికష్టంపై ఘర్షణను నివారించగలిగారు. అనివార్యంగా కమిటీ నాయకులు సమావేశాన్ని వాయిదావేశారు.

అట్టహాసంగా నిధులు..

పట్టణ నడిబొడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రత్యేకమైంది. సువిశాలమైన నాలుగు ఎకరాల విస్తీర్ణంలో 125 ఏళ్లకు పూర్వమే ఇక్కడ శ్రీవాసవీ అమ్మవారి ఆలయం నిర్మితమైంది. ఆలయానికి ముందు 14 గదులతో ధర్మసత్రాన్ని నిర్మించారు. 1931లో ధ్వజ స్తంభం ప్రతిష్ఠ చేశారు. ఆర్యవైశ్యుల వివాహ అవసరాల నిమిత్తం కళ్యాణమండపాన్ని నిర్మించారు. 1998లో 60 అడుగుల రాజగోపురాన్ని నిర్మించారు. 2004 నుంచి ఆలయం పురోగతి విస్తృతమైంది. అదనంగా శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. దేవస్థానం స్థలంలోనే గీతాభవనం, వైశ్య వ్యాయామశాల, వైశ్యవిద్యార్థి ధర్మనిధి, ఆర్యవైశ్య అపరకర్మశాలలు ఉన్నాయి. ప్రస్తుతం ఆలయంలో నాలుగు కల్యాణ మండపాలున్నాయి. 20 సూట్లు సమకూరాయి. దేవస్థానం సత్రం కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతోనే ఇవన్నీ సమకూర్చుకోగలిగారు. ఆలయానికి ప్రస్తుతం రూ.2 కోట్ల నిధులున్నాయి. వెండి, బంగారం భారీగానే ఉంది. ఆలయానికి నెలకు రూ.10 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది.



డీఎస్పీ జనార్దనరావు, పోలీసు అధికారులు



ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసిన సభ్యులు

టీడీపీకి చెందిన ఆర్యవైశ్యుల హడావుడి..

రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. దీంతో ఆలయ పాలకవర్గంపై ఆధిపత్యం కోసం టీడీపీ ఆర్యవైశ్య నేతలు పావులు కదపటం ఆరంభించారు. పాలకవర్గం పదవీకాలం పూర్తవటంతో ఎన్నికల నిర్వహణకు పట్టుబట్టారు. ఇందుకు కమిటీ ఆమోదం తెలిపింది. సర్వసభ్య సమావేశానికి తేదీ నిర్ణయించి, వెయ్యిమంది వరకు గల ఆలయ కమిటీ సభ్యులకు లేఖలు పంపారు. ఆదివారం సర్వసభ్య సమావేశానికి రంగం సిద్ధమైంది. సభ్యులను గుర్తించి సంతకాలు తీసుకొని పైఅంతస్తులోని కల్యాణమండపంలోకి పంపుతుండగా.. టీడీపీకి చెందిన ఆర్యవైశ్యుల హడావుడి మొదలైంది. అప్పటికే పోలీసు బందోబస్తు ఏర్పాటైవుంది. సభ్యులను గుర్తించే ప్రక్రియపై ముందుగా అభ్యంతరాలను వ్యక్తంచేశారు. తర్వాత కమిటీ ఎన్నిక నిర్వహించాలని పట్టుబట్టారు. తన అనుచరులతో సహా వచ్చిన 19వ వార్డు టీడీపీ కౌన్సిలరు వీరికి తోడయ్యారు. ఎన్నిక జరపాల్సిందే అంటూ హల్‌చల్ చేశారు. దీనిపై ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. నువ్వెంత అంటే నువ్వెంత అనుకున్నారు. డీఎస్పీ బి.జనార్దనరావు హుటాహుటిన రంగప్రవేశం చేశారు. టీడీపీ కౌన్సిలరు సహా బయటి వ్యక్తులను వెలుపలికి పంపేశారు. అనివార్యమైన పరిస్థితుల్లో సమావేశాన్ని వాయిదావేశారు. మధ్యాహ్నం ట్రైనీ అడిషనల్ ఎస్పీ సుప్రజ గుంటూరు నుంచి వచ్చి వివరాలను నమోదుచేసుకుని వెళ్లారు.

భిన్నంగా ఎన్నిక..

దేవస్థానం కమిటీ ఎన్నికలకు ఒక పద్ధతంటూ ఉంటుందని తెలిసిందే. సర్వసభ్య సమావేశంలో పాత కమిటీని కొనసాగించాలని నిర్ణయం తీసుకోవచ్చు. లేదా ఎన్నిక జరిపి కొత్తవారిని ఎన్నుకోవాలని మెజారిటీ సభ్యులు అభిప్రాయపడితే ఆ ప్రకారం ఎన్నికకు తేదీని నిర్ణయించుకుంటారు. ఆ ప్రకారం మళ్లీ సభ్యులకు నోటీసు పంపి, నిర్ణయించుకున్న రోజున ఎన్నికలు జరుపుతారు. వీటన్నిటికీ భిన్నంగా ఆర్యవైశ్యుల్లోని టీడీపీ నేతలు ఇదేరోజున ఎన్నిక జరపాలని డిమాండ్ చేయడం.. దేవాలయంతో ఎలాంటి సంబంధం లేని 19వ వార్డు టీడీపీ కౌన్సిలరు, బయటి వ్యక్తులతో సహా వచ్చి వీరికి మద్దతుగా హడావుడి చేయటంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

సర్వత్రా విమర్శలు..

ఇదిలావుంటే.. పాలకవర్గం ప్రస్తుత అధ్యక్షుడు, ఆలయ అభివృద్ధిలో తనదైన ముద్రవేసిన నూకల వెంకట వేణుగోపాలరావు తీవ్ర అస్వస్థతతో కొద్దిరోజులుగా హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో ఉన్నారు. మెరుగైన వైద్యం కోసం శనివారం ఆయన్ను అమెరికా తీసుకెళ్లారని చెబుతున్నారు. ఇలాంటి తరుణంలోనే ఎన్నడూ లేని విధంగా ఆలయ పాలకవర్గంలో ఆధిపత్యం కోసం టీడీపీ విఫలయత్నం చేయడం సర్వత్రా విమర్శలకు గురవుతోంది.

సంఘసంస్కర్త పూలే జీవితంపై సినిమా భేష్



తెనాలి: నాటికాలంలో సామాజిక దురన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన ప్రముఖ సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే జీవితంపై తీసిన సినిమా ప్రదర్శిస్తున్న పెమ్మసాని థియేటరుకు చిత్ర దర్శకుడు, ప్రధానమైన పూలే పాత్రలో నటించిన పీఎం సుందరరావు ఆదివారం విచ్చేశారు. చిత్రంలో నటించిన తెనాలి నటులతో కలిసి సినిమాను తిలకించారు. ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా సన్నివేశాలను చిత్రీకరించారని 'శిశిరం' దర్శకుడు కనపర్తి రత్నాకర్ అభినందించారు. దర్శకుడు సుందరరావు మాట్లాడుతూ.. తెనాలి కళాకారులు ఒక్క రూపాయి కూడా ఆశించకుండా ఇందులో నటించి సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. సినిమాలో తెనాలి పురపాలక ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అలపర్తి వెంకటేశ్వరరావు, బెల్లంకొండ వెంకట్‌ను ఉపాధ్యాయ సంఘాలైన ఎస్‌టీయూ రాష్ట్ర నాయకుడు ఈ.అంబరీష్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు అహమ్మద్ హుస్సేన్‌లు సత్కరించారు. నటులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, వెలగా సుభాష్ చంద్రబోస్, ఈఎల్‌వీ అప్పారావు, హేమంతు, ఆంజనేయ శర్మ, ప్రసాద్ రెడ్డి, జి.వెంకటేశ్వర్లు, ఎస్ఎంఎంఎస్ ప్రకాష్, షరీఫ్, ప్రసాదు, భవాని, నగరాజకుమారి పాల్గొన్నారు.

వ్యాపారవేత్త కరణం ధర్మారావు మృతి

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త కరణం ధర్మారావు ఆదివారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ధర్మారావు భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు పట్టణ ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. సోమవారం ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు స్మారకార్థం టోర్నమెంట్

తెనాలిటౌన్: ఇటీవల మృతి చెందిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు డాక్టర్ శ్రీధర్ స్మారకార్థం స్థానిక చెంచుపేటలోని ఇండోర్ స్టేడియంలో శ్రీధర మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆదివారం నిర్వహించారు. స్టేడియంలో క్రీడాకారులను సీనియర్స్, జూనియర్స్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా వినయ్‌కుమార్, శ్రీమన్నారాయణ, రన్నర్స్‌గా రాజా, వరుణ్ నిలిచారు. సీనియర్స్ విభాగంలో పండు, చంటి విన్నర్స్ కాగా అఖిలేష్, బాబీ రన్నర్స్‌గా విజయం సాధించారు. బెస్ట్ ప్లేయర్‌గా సాయిచరణ్, విజ్ఞాన్ నిలిచారు. టోర్నమెంట్ ద్వారా వచ్చిన ఎంట్రీ ఫీజు రూ.13వేలు, స్పాన్సర్ లోకేష్ అందించిన రూ.10వేలు మొత్తం రూ.23 వేల నగదును శ్రీధర్ కుటుంబ సభ్యులకు అందజేసినట్లు టోర్నమెంట్ నిర్వాహకులు శ్రీనివాస్, సాయిలలిత తెలిపారు. పోటీల్లో విజేతలను మెమెంటోలతో సత్కరించారు.



విజేతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు రమణ

తెనాలిఅర్బన్: శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి ఆధ్వర్యంలో సాయిబాబా గుడి సమీపంలో ఏర్పాటుచేసిన చలివేంద్రంలో ఆదివారం మజ్జిగను పంపిణీ చేశారు. వీఆర్ కన్సల్‌టేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పెసర్లంక రమణ, శేఖర్‌ల సహకారంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లిబోయిన రాము, మల్లిబోయిన బాజీ, అక్కల రమేష్‌బాబు, యశ్వంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలిఅర్బన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో బోసురోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చలివేంద్రంలో మజ్జిగ, మంచినీళ్ల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సంస్థ ప్రతినిధి కుర్రా శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు డి.మురళీకృష్ణ, మొవ్వా సత్యనారాయణ, అడ్డాల ఆంజనేయులు, ఈదరవెంకట పూర్ణచంద్, జి.వి.నారాయణ, కన్నెగంటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏసీ లక్ష్మీపతిరావు, సత్యనారాయణ

జొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

తెనాలి: తెనాలి ప్రాంతంలో ఆదివారం కురిసిన వడగళ్ల వాన కారణంగా నష్టపోయిన జొన్న, మొక్కజొన్న రైతులని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. ఇప్పటికే రెండు పర్యాయాల వర్షం కారణంగా జొన్న రైతులు నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు పెట్టి నాణ్యత ప్రమాణాలను లెక్కించకుండా రైతుల వద్ద ఉన్న ప్రతీ గింజను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రేపు పీఎం నేషనల్ అప్రెంటిస్ మేళా

తెనాలిఅర్బన్: పీఎం నేషనల్ అప్రెంటిస్ మేళాను మంగళవారం తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు తెలిపారు. ఐటీఐ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులందరూ పాల్గొనవచ్చునని తెలిపారు. బయోడేటా, విద్యార్హత, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 10.30 గంటలకు జరిగే మేళాలో పాల్గొనాలని అన్నారు. ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని, వివరాలకు 90144 91772, 99598 28100 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు



ర్యాలీలో పాల్గొన్న టౌన్‌చర్చి చిన్నారులు, సంఘ పెద్దలు



చావావారిపాలెంలో మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న లూథరన్ సంఘస్తులు

తెనాలిఅర్బన్: మట్టల ఆదివారం వేడుకలను తెనాలిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చిన్నారులు ఈత మట్టలను పూలతో అలంకరించి వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. హోసన్నా జయం జయం అంటూ నినాదాలు చేశారు. బోసు రోడ్డులోని టౌన్ చర్చి ఆధ్వర్యంలో సండే స్కూల్ ఆధ్వర్యంలో శివాజీచౌక్ కళాక్షేత్రం వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమాన్ని సండే స్కూల్ నిర్వాహకులు విక్టోరియా జాన్‌మోహన్ పర్యవేక్షించారు. ఐతానగర్‌లోని బాప్టిస్ట్ చర్చి, సాల్వేషన్ ఆర్మీ చర్చిల ఆధ్వర్యంలో వేరువేరుగా మట్టల ఆదివారం వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్వాహకులు గేరా థామస్, గేరా సీయోను కుమారి, పి.నాగరాజు, రత్న సుందరీ, గాలి రవికుమార్, బాప్టిస్ట్ చర్చి నిర్వాహకులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు. చినరావూరులోని లూథరన్ చర్చి సండే స్కూల్ టీచర్ పిల్లి ప్రేమరాజు ఆధ్వర్యంలో మట్ల ఆదివారం వేడుకలు నిర్వహించారు. చిన్నారులు ఆ ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దీనమ్మ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

తెనాలిరూరల్: మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా చర్చిలలో ప్రత్యేక ఆరాధనలు చేశారు. పలు సంఘాల ఆధ్వర్యంలో క్రీస్తు ఎరుషలేము పర్యటనను ప్రదర్శించారు. మండలంలోని చావావారిపాలెం లూథరన్ చర్చిలో సంఘ కాపరి రెవరెండ్ పత్రే వరబాబు, దైవ సేవకురాలు పి.విజయ, సంఘ పెద్దలు, మహిళలు, పిల్లలు సంఘస్తులు పాల్గొని వేడుకలు చేశారు. మారిస్‌పేట రాక్ గాస్పెల్ చర్చిలో బిషప్ పినపాటి జాన్‌పాల్ వాక్యోపదేశం చేశారు. మల్లెపాడు ఏబీఎం చర్చి సండే స్కూల్ పిల్లలు గ్రామంలో మట్టలతో ఊరేగింపు నిర్వహించారు.

అ'పూర్వ' కలయిక.. ఆత్మీయ వేడుక



హాజరైన పూర్వ విద్యార్థులు

కొల్లిపర: కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 48 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థినీ, విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. 1976-77వ సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకున్న వీరంతా పాఠశాలకు చేరుకుని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. అలనాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. నాటి గురువులు బోధించిన విధానాలను తలచుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు లంకిరెడ్డి శివన్నారాయణ, సీహెచ్ రామనాథశర్మ, జి.కోటయ్య, పెండెల కృష్ణారావు, పిచ్చియ్య శాస్త్రిలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు స్పందనలు వినిపించారు. సభాధ్యక్షులు పూర్వ విద్యార్థి అన్నపురెడ్డి కోటిరెడ్డి మాట్లాడుతూ.. జీవితంలో అభివృద్ధి చెందాలంటే నిత్యవిద్యార్థిగా పాఠాలను నేర్చుకోవాలన్నారు. పూర్వవిద్యార్థులుగా పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అచ్యుత సాంబశివరావు, డాక్టర్ భీమవరపు రామకృష్ణారెడ్డి, కలకోటి శ్రీనివాస్ రెడ్డి, వంగా శేషిరెడ్డి, భీమిరెడ్డి శేషిరెడ్డి, లంకిరెడ్డి సత్యవతి, నున్నా సుజాత, మేదరమెట్ల అంజన, మురళి తదితరులు పాల్గొన్నారు.

రామ మందిరంలో భారీగా అన్నదానం

తాడేపల్లి రూరల్: ఇప్పటంలోని రెడ్ల రామమందిరంలో ఆదివారం రాత్రి భారీ అన్నదానం నిర్వహించారు.

నవమి వేడుకల్లో భాగంగా మందిరంలో నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈనెల 6న భక్తిశ్రద్ధలతో సీతారామ కల్యాణోత్సవాన్ని జరిపారు. ఉత్సవాలు చివరి రోజు ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు ఆరు వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వంగవీటి మోహనరంగా సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలిటౌన్: బడుగుల పెన్నిధి, విజయవాడ తూర్పు మాజీ శాసనసభ్యుడు వంగవీటి రంగా సేవలు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయమని కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలో రావిచెట్టు సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహాన్ని ఆదివారం రంగా తనయుడు వంగవీటి రాధ, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆలపాటి మాట్లాడారు. కులమతాలకు అతీతంగా పేద ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కఠెవరం గ్రామంలో రంగా విగ్రహం ఏర్పాటు చేయడం ముదావహమని నిర్వాహకులను అభినందించారు. వంగవీటి రాధ మాట్లాడుతూ.. ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు తన తండ్రి కావడం తాను చేసుకున్న పూర్వ జన్మ సుకృతమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, నాసా సైంటిస్ట్ చందు సాంబశివరావు, సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, బీఎస్ఆర్ పవర్ కన్‌స్ట్రక్షన్ నిర్వాహకులు బి.శ్రీనివాసరావు, రాధా రంగా మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు పురస్కారాలు



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న ఏఆర్ఆర్ కళాశాల కమిటీ సభ్యులు

కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం కమిటీ సభ్యులు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో అవుతు రత్నకుమారి 470 మార్కులకు గాను 460 మార్కులు, బైపీసీలో గుదిబండి బసవసింధు 420 మార్కులుగాను 420 మార్కులు, రెండో సంవత్సరం ఇంటర్మీయట్‌లో కొల్లి దీపిక ఎంపీసీలో 1000 మార్కులకు గాను 933 మార్కులు సాధించి కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు కళాశాల కమిటీ సభ్యులు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఎన్ఆర్ఐకి చెందిన గాదె రవీంద్రరెడ్డి రూ.5 వేలు, గుదిబండి శ్రీనివాసరెడ్డి రూ.5 వేలు, బొమ్మారెడ్డి మురళిమోహన్‌రెడ్డి రూ.5 వేల నగదును విద్యార్థులకు కళాశాల కమిటీ సభ్యులు ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అవుతు కృష్ణారెడ్డి, కోశాధికారి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ కూరపాటి రవిశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చింతా మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.